డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

గాజులరామారం: కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునరావును ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిలువేరు శ్రీనివాస్, రాసమల్ల యాదగిరి, రమేష్, నడిమిదొడ్డ సలోమి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా కాల్వల నిర్మాణం

- ప్రమాదకరంగా లోతైన గుంతలు
- రెండేళ్లుగా పూర్తికాని సర్వీస్‌రోడ్డు పనులు



చందానగర్ బస్టాప్ సమీపంలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ, వరదనీటి కాల్వ గుంతలు



మియాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చందానగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం తవ్విపడవేసిన డ్రైనేజీ, వరదనీటి కాల్వల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. రోడ్ల పక్కన పెద్దపెద్ద గోతులు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గుంతల కారణంగా రాత్రిపూట ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా చందానగర్ సర్వీస్‌రోడ్డును ఫ్లై ఓవర్ చివరి వరకు పునరుద్ధరించకుండా ఫ్లై ఓవర్ దగ్గర మాత్రమే అభివృద్ధి చేసి మీగతా ప్రాంతంలో అసంపూర్తిగా వదిలేశారు. దీనితో పాటు చందానగర్‌లో కమర్షియల్ కాంప్లెక్స్ ముందు డ్రైనేజీ గోడల స్లాబ్‌ను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వివిధ పనుల మీద ఆయా ప్రాంతాలకు వచ్చే వారితో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. కానీ అక్కడే లోతైన గుంతలతో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్కన పెద్ద పెద్ద గుంతలు ఉన్నా ఎలాంటి హెచ్చరికలు లేకపోవడంతో ఎప్పుడూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో పాటుగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా వరకూ ఎడమవైపు ఉన్న సర్వీస్‌రోడ్డు రెండేళ్ల కితం తవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలగడమే కాకుండా, ఫుట్‌పాత్ ఆక్రమణలతో వాహన దారులు రాకపోలకు అసౌకర్యంగా మారింది. దీనికి తోడు అడుగుకో గుంత ఉండటంతో స్థానికులు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కానీ కాంట్రాక్టర్ సర్వీస్‌రోడ్డును పునరుద్ధరించకుండా రోడ్డుపై గుంతలు అలాగే వదిలేశాడు. దీనికి తోడు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కంకర కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్‌రోడ్డు పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రమాదకరంగా మారిన వరదనీటి కాల్వలు, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అద్దెకుంటున్న ఇంట్లో చోరీ

- పోలీసులకు చిక్కిన మహిళ
- 20 తులాల నగలు స్వాధీనం

నిజాంపేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తనకున్న అప్పు తీర్చుకొని సంతోషంగా జీవించాలని అనుకున్న ఓ మహిళ ఆమె అద్దెకుంటున్న ఓనర్ ఇంటికే కన్నం వేసింది. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జర్నలిస్ట్‌కాలనీలో నివాసం ఉండే బడుగు జ్యోతి(27) తాను అద్దెకు ఉంటున్న యజమాని భార్యతో సన్నిహితంగా ఉండేది. ఈ క్రమంలో ఆ ఇంటి తాళం చెవులను డూప్లికేట్ చేయించి తన వద్ద దాచుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనకు మరిది వరుసయ్యే ఇంద్రమ్మకాలనీలో ఉండే జంపని చైతన్యకుమార్(22)తో కలిసి బంగారు నగలు, నగదు చోరీ చేశారు.

అయితే ఇంటి యజమానులు వచ్చి చూసేసరికి ఇంటి తాళం వేసింది వేసినట్టే ఉంది.. కానీ బీరువాలో దాచిన నగలు, రూ.90 వేల నగదు మాయంకావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ ఉపేందర్ రావు ఆదేశాల మేరకు డీఐ తిమప్ప ప్రత్యేక టీంతో బంగారు దుకాణాల వద్ద నిఘా పెట్టించారు. ఈ క్రమంలో శనివారం ప్రగతినగర్‌లో బ్యాగు చేతిలో పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని చూడగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. పోలీసులు వారి నుంచి రూ.14 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు రెండేళ్లుగా అదే ఇంట్లో అద్దెకు ఉంటూ వారి కదలికలను గమనిస్తూ చోరీకి పాల్పడిందని పోలీసులు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు, నిందితులు జ్యోతి, చైతన్యకుమార్

లింక్ ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ

ఎస్‌బీఐ ఖాతాదారులకు రివార్డు పాయింట్స్ పేరుతో నకిలీ మెసేజ్‌లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరో కొత్తరకం మోసానికి తెరతీశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారులను లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ పేరుతో ఒక నకిలీ మెసేజ్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. "ప్రియమైన వినియోగదారులారా..! మీ ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు (9980.00) గడువు నేటితో ముగుస్తుంది. వెంటనే ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది." అంటూ నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వచ్చిన మెసేజ్ నిజమని నమ్మి లింక్‌ను ఓపెన్ చేసి ఎస్‌బీఐ రివార్డు యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వెంటనే 'మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు. దాంతో మీ ఫోన్ కంట్రోలింగ్ వారి చేతికి వెళ్తుంది. ఫోన్‌లో మీరు ఎస్‌బీఐ ఖాతా వివరాలు నమోదు చేయగానే వారు ఖాతాలో ఉన్న డబ్బు ఖాళీ చేస్తారు' అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారులు ఈ మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మొద్దని, ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఫోన్‌లో ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

జీడిమెట్ల పారిశ్రామికవాడలో వ్యక్తి దారుణహత్య

జీడిమెట్ల,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఇండియన్ గ్యాస్ గోదాం ఎదుట ఓ వ్యక్తి దారుణహత్యకు గురైయ్యాడు. సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో నాలా పక్కన పడిఉన్న శవాన్ని చూసి స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించగా.. మృతుడు గాజులరామారం దేవేందర్‌నగర్‌కు చెందిన ముస్తఫా(40)గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపిపిన వివరాల ప్రకారం.. దేవేందర్‌నగర్‌కు చెందిన పిక్‌పాకెటర్ ముస్తఫా ఆరు సంవత్సరాల క్రితం గౌస్ అనే యువకుడిని బండ రాయితో తలపై మోది హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఈ కేసులో ముస్తఫా ఆరు నెలలు జైలు కు వెళ్లి వచ్చాడు. ఈ నేపథ్యంలో తనను చంపాలని చూసిన ముస్తఫాపై పగ పెంచుకున్న గౌస్.. ఎలాగైనా అతడిని హత్య చేయాలని నిర్ణయించుకొని, అదునుకోసం ఎదురుచూసి ముస్తఫాను హత్య చేసి నాలా పక్కన పడేసి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గౌస్ సహా.. పలువురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. త్వరలో పూర్తి వివరాలు నిందితుల పూర్తి వివరాలు తెలుస్తాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలి

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ బోధనలో భారతీయ ప్రమాణాలను మిళితం చేయాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో స్టాండర్డ్స్ క్లబ్స్‌గా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులకు 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే అంశంపై బీఐఎస్ రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా 10 వేలు, తెలంగాణలో 190 పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే కొత్త కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు రాకేష్, కెవిన్, ఏఎన్ఎస్సీ శాస్త్రీలు ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.



శిక్షణలో పాల్గొన్న సైన్స్ ఉపాధ్యాయులు

అక్రమ షెడ్డుపై డీసీకి ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భద్రసాయినగర్‌లో నిర్మాణం చేపడుతున్నషెడ్డుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బలరామ్ కుత్బుల్లాపూర్ డీసీ నర్సింహకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీడిమెట్ల డివిజన్‌లోని భద్రసాయినగర్‌లో అక్రమంగా షెడ్డును నిర్మాణం చేస్తున్నారని, గతంలో అధికారులకు ఫిర్యాదు చేస్తే అప్పట్లో కూల్చివేశారని తెలిపారు. మళ్లీ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు, అధికారులు అండదండలున్నాయని, అందుకే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి, షెడ్లను తొలగించాలని కోరుతున్నారు.



అక్రమంగా నిర్మించిన షెడ్డు

జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ పరీక్షల ఫలితాలెప్పుడో!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) ప్రవేశాల కోసం జేఎన్‌టీయూ నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాల వెల్లడిలో ఎడతెగని జాప్యం జరుగుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసమని ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన జేఎన్‌టీయూ అధికారులు, కేవలం ప్రవేశపరీక్ష నిర్వహించ డానికి ఆర్నెళ్ల సమయం తీసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గత నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌డీ అడ్మిషన్ కోసం మొత్తం 1,031 మంది దరఖాస్తు చేసుకోగా, అంతులేని జాప్యం కారణంగా 300 మందికి పైగా అభ్యర్థులు ఎంట్రన్స్ పరీక్షలకు హాజరు కాలేదు. సుమారు 700 మంది పరీక్షలు రాయగా, పరీక్షలు నిర్వహించి రెండు వారాలవుతున్నా ఫలితాలను వెల్లడించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో, పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో, ఫలితాలు, ఇంటర్వ్యూలు, అడ్మిషన్లు ఎప్పుడు జరుగుతాయో అర్థంకాక దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినపుడే ప్రతి ప్రక్రియకు ఒక నిర్దేశిత తేదీని ప్రకటిస్తే బాగుండేదంటున్నారు. పీహెచ్‌డీ ప్రవేశపరీక్ష ఫలితాలను వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి వీసీకి విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇచ్చే నోటిఫికేషన్లలో స్పష్టమైన తేదీలను ప్రకటించి గడువులోగా అడ్మిషన్లు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

మహిళ అదృశ్యం



సరిత

రాయదుర్గం,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన గచ్చిబౌలిపోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి అంజయ్యనగర్‌కు చెందిన సరిత(26) శుక్రవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించినా సమాచారం తెలియలేదు. దీంతో శనివారం గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

మియాపూర్: ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజశేఖర్(21) శుక్రవారం హఫీజ్‌పేటలోని ఓయో రూమ్స్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. కాగా హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్యహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

దొంగ అరెస్ట్

నిజాంపేట్: రాత్రుళ్లు చోరీలకు పాల్పడుతున్న నిందితుడు ఆంజనేయులు అలియాస్ అనీష్‌ను బాచుపల్లి పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జూలై 31న అర్ధరాత్రి తర్వాత ప్రగతినగర్‌లోని శ్రీసాయి వెంకటేశ్వర కిరాణా షాపులో దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసుకొన్న పోలీసులు నిఘా పెట్టారు. వరుసగా రాత్రివేలలో దొంగతనాలు జరుగుతుండటంతో క్రైం టీం ప్రత్యేక నిఘా పెట్టింది. శనివారం నిజాంపేట్ బస్టాపులో ఓ కిరాణదుకాణం వద్ద సిగరెట్ ప్యాకెట్స్‌తో ఉన్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. రాత్రి సమయాల్లో కిరాణ దుకాణాల్లో దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కకుండా ఉంటున్నాడు. నిందితుడి నుంచి రూ.10వేల నగదుతో పాటు రూ.30వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు



హైదర్‌నగర్: కారును వెనక్కి తిప్పుతుండగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ నుంచి ప్రగతినగర్ వైపుగా వెళ్తున్న కారు చెరువు ప్రారంభంలో టర్న్ చేసుకునే క్రమంలో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను కాపాడారు. స్థానికుల సహాయంతో యజమాని కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కారులోకి పూర్తిగా నీరు వెళ్లడంతో కారు పాడయింది.

కుట్టుమిషన్లు పంపిణీ చేసిన లయన్స్‌క్లబ్



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కరుణాకర్‌గౌడ్, విజయ్

మియాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కు చెందిన ఐదుగురికి లయన్స్‌క్లబ్ హోఫ్, హోఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. శనివారం లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ కరుణాకర్‌గౌడ్, జోన్ చైర్మన్ కొండ విజయ్‌లు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా ఆపదలో ఉన్న వారికి సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ హోఫ్ అధ్యక్షుడు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశ్, సుధీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

'సుందరీకరణ కోసం ప్రాంతాలను అన్వేషించండి'



అధికారులతో మాట్లాడుతున్న జడ్సీ అపూర్వ్‌చౌహాన్

కేపీహెచ్‌బీకాలనీ: సుందరీకరణ కోసం జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రాంతాలను అన్వేషించాలని కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్‌చౌహాన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, బాలానగర్, జీడిమెట్ల, అల్వాల్ ట్రాఫిక్ పోలీస్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ ముందుగా ట్రాఫిక్ రహిత ప్రయాణమే లక్ష్యం కావాలని, అందుకోసం ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అడ్డంకులను తొలగించాలన్నారు. ప్రధాన చౌరస్తాలు, కూడళ్లలో చేపట్టాల్సిన సుందరీకరణ గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు సాధ్యాసాధ్యాలపైనా నివేదిక ఇవ్వాలన్నారు. వాహనాల రాకపోకల విషయంలో ట్రాఫిక్ పోలీసులకు ఎంత బాధ్యత ఉంటుందో టౌన్‌ప్లానింగ్ అధికారులకూ అంతే బాధ్యత ఉంటుందన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



రాజీవ్‌గాంధీ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

అల్లాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలలో పర్యటించారు. సఫ్దర్‌నగర్, యూసుఫ్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లలో అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగంతో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమీక్ష జరిపారు. సఫ్దర్‌నగర్, యూసుఫ్‌నగర్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతుండటం, రోడ్ల దుస్థితి కారణంగా ప్రజల అవస్థలు, మౌలిక సదుపాయాలు కూడా అధికారులు పట్టించుకోకపోవటంపై ఎమ్మెల్యే కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలి, విద్యుత్ శాఖ అధికారులు లక్ష్మీ, నారాయణ, ప్రకాష్, రంజిత్, భాస్కర్, నాయకులు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, దుర్గ పాల్గొన్నారు.

ప్రతీ శనివారం గైనకాలజిస్ట్ కన్సల్టేషన్ ఉచితం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వర్కింగ్ ఉమెన్, కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా మెడికవర్ ఉమెన్-చైల్డ్ ఆస్పత్రి ఏర్పాటు చేసిన షీ క్లినిక్ ద్వారా ప్రతి శనివారం ఉచిత గైనకాలజి కన్సల్టేషన్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ క్లినిక్‌ను శనివారం హైటెక్ సిటీలో ప్రారంభించారు. క్లినిక్‌ను సందర్శించేవారికి కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ 30 శాతం డిస్కౌంట్‌తో పాటు ఏడాదికి ఒక సారి కాంప్లిమెంటర్ హెల్త్ ప్యాకేజీ సదుపాయం అందిస్తున్నట్లు తెలిపాయి. ఈ సదుపాయం పొందే వారు తమ వెంట ఐడీ కార్డును తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఒత్తిడి, సరైన లైఫ్‌స్టైల్ లేని కారణంగా ఇతర కారకాల ప్రభావాలతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, మహిళలు ఆరోగ్యం విషయంలో ప్రతీ దశలోనూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ఇప్పుడున్న ఆహారపు అలవాట్లు, ఒత్తిడి కారణంగా అన్ని వయస్సుల వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాష్ ట్యాగ్ మార్కెటింగ్ వ్యవస్థాపకురాలు గుల్నార్ విర్క్ కృష్ణ, చీఫ్ లీగల్ కంప్లయిన్స్ ఆఫీసర్ ఇషా సిన్హా, మెడికవర్ ఆస్పత్రి చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేష్ దెగ్లూర్కర్, డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగే, సెంటర్ హెడ్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో వైద్య సదుపాయాలు

మాదాపూర్: దేశంలో అత్యున్నత ప్రమాణాలతో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని నేషనల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మినుబజ్ పాయి అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రి లో శనివారం డీఎన్‌బీ (డిప్లొమాఆఫ్ నేషనల్ బోర్డు) వైద్యుల అసోసియేషన్ మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్యులు, రోగుల నిష్పత్తిలో భారీ అంతరం ఉన్నదని, దీనిని తగ్గించేందుకు ప్రతీ జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. నేషనల్ బోర్డు సైతం వంద పడకల ఆస్పత్రిలో డీఎన్‌బీ కోర్సుల అనుమతిని చాలా సులభంగా అందిస్తుందని పేర్కొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డా.లింగయ్య మాట్లాడుతూ ప్రతీ రాష్ట్రంలో తమ అసోసియేషన్ కో-ఆర్డినేటర్లను నియమించనుందని, వారి ద్వారా సమస్యలను నేషనల్ బోర్డుకు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

5 నుంచి పచ్చదనం.. స్వచ్ఛదనం: జడ్సీ



అధికారులతో మాట్లాడుతున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాలు ఈనెల 5 నుంచి ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తాయని ప్రతి రహదారిలో స్వచ్ఛ పరిసరాలతో పాటు ఆహ్లాదం కలిగేలా పచ్చదనం పెంపొందించాలన్నారు. శనివారం జోనల్ కార్యాలయంలో పచ్చదనం. స్వచ్ఛదనం కార్యక్రమంపై చందానగర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, రామచంద్రాపురం, యూసుఫ్‌గూడ సర్కిళ్ల ఉపకమిషనర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ ఆయా ప్రాంతాలను ఆహ్లాదకరమైన వాతావరణంతో తీర్చిదిద్దుకోవాలన్నారు. నాలాలు, డ్రైన్‌లల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, నివాస, అవాసాల ఆవరణలో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. 6వ తేదీన దోమల నివారణ కోసం ఫాగింగ్, వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు, వీధి శునకాలకు స్టెరిలైజేషన్ నిర్వహించాలని జడ్సీ సూచించారు. 7వ తేదీన చెరువుల పరిరక్ష, నిర్మాణ వ్యర్థాల, చెరువుల ఆక్రమణ తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఖాళీ స్థలాలు, ఆవాసాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

ప్రతీ ఒక్కరు మొక్కలను పెంచాలి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో లహరిగ్రీన్ పార్కు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణతో కలిసి శనివారం మొక్కలను నాటారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా వెచ్చించి పనులు చేయిస్తామని అన్నారు.